# అసమర్థుడు

శృంగారం సింగరాచార్య



"...అందుకే ప్రతి మానవుడూ తోటి మానవుణ్ణి ప్రేమించడం నేర్చుకోవాలి. అప్పుడే సంఘం బాగుపడుతుంది. మానవుణ్ణి మానవుడాదుకోనట్టిపోతే జంతువులాదుకోవు. నేను చెప్పిన విషయాలన్నీ దృష్టిలో ఉంచుకుంటేచాలు. సెలవు" అంటూ ముగించాడు దామోదరం తన ఉపన్యాసాన్ని.

పూల హారాలు అతని మెడను పూర్తిగా కప్పివేశాయి. జయ జయ ధ్వానాల మధ్య ఆ ఉత్సవానికి అధ్యక్షత వహించిన దామోదరం వేదిక నుండి క్రిందికి దిగాడు. పెద్దవారు ఒక్కొక్కరే అతన్ని అభినందిస్తూ, పుష్ప గుచ్ఛాల నందిస్తున్నారు. చిరునవ్వుతో దామోదరం అందరినీపలుకరిస్తున్నాడు.

అదే సమయంలో జనాన్ని తోసుకుంటూ ఒక వ్యక్తి ఉత్సాహంగా దామోదరం వద్దకొచ్చి తన చేతిలోని గులాబీ పుష్పాన్ని అతనికందించి వినయంతో నిలబడ్డాడు.

తైల సంస్కారం లేని జుట్టు, మాసిన గడ్డం పీక్కుపోయిన కళ్ళు, చిరిగి పీలికలైపోయిన అతని గుడ్డలు అతను చాలా నిరుపేదని చెబుతున్నాయి.

కొందరు పోలీసులు అక్కడికి పరుగెత్తుకొని వచ్చి, ఆ వ్యక్తి మెడపై చేయివేసి "వెధవా, మమ్మలను తోసుకొని వస్తావా? ఇదేం వినోద ప్రదర్శన మనుకున్నావా? పద బైటికి" అంటూ అతన్ని త్రోయసాగారు.

"ఆగండి ఆ వ్యక్తిని వదిలిపెట్టండి" అన్నాడు గంభీరంగా దామోదరం. పోలీసులు అతని మెడపై నుండి చేతిని తీసివేశారు.

దామోదరం ఆ వ్యక్తి దగ్గరకొచ్చి "మీ పేరు" అని అడిగాడు ఆప్యాయంగా.

"రాజశేఖరం" అంటూ టూకీగా సమాధానమిచ్చాడా వ్యక్తి.

"మీ వాత్సల్యానికి నా కృతజ్ఞతలు." అంటూ వినయంగా కృతజ్ఞతను తెలిపాడు దామోదరం.

"మీ వంటి ఉదారులను చూడడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఇంతవరకూ నా ముప్ఫయి ఏళ్ళ జీవితములో మీవోటి ఉదారులు నాకు కనిపించలేదంటే నమ్మండి. తండ్రివంటి మీకు నా బాధలు చెప్పుకోవడానికి నేను సంశయించను." అంటూ చెప్పసాగాడు రాజశేఖరం.

"నా పేరు రాజశేఖర మని ముందే మనవి చేశాను. బియస్సి చదివాను. కాని ఏం లాభం? కని పెంచిన నా కన్నతల్లిని సుఖపెట్టలేకపోయిన అసమర్థుడిని. ఏ ఆఫీసుకు వెళ్ళినా "ఖాళీలు లేవు" అన్న బోర్డులే కనిపించాయి. చివరికి నా తల్లి జబ్బుకు మందుకూడా వేలేక పోయాను. నా అసమర్థత వలన నా తల్లి చావు బ్రతుకులలో వుంది. ఇది నాకథ" అంటూ బాధగా ముగించాడు.

"మీరు చెప్పింది నా కెంతో బాధ కలిగించిందండీ, మీ వోటి వారికి సహాయం చెయ్యకపోతే మానవత్వానికే విలువలేకుండా పోతుంది. రేపు మీరు మా ఆఫీసుకురండి నా చేతనైనంత సహాయం చేస్తాను" అంటూ వాగ్దానం చేశాడు దామోదరం.

"మీమేలు జన్మజన్మాలకూ మరచిపోనండీ" అంటూ ఒక పెద్దసంస్థకు అధ్యక్షుడనే తలంపైనా లేకుండా ఉత్సాహంగా దామోదరం చేతులుపట్టుకొని ఊపేశాడు రాజశేఖరం.

ఉదయమే ఉత్సాహంగా రాజశేఖరం దామోదరం ఆఫీసుకు వెళ్ళాడు. ఆఫీసు వాతావరణ మంతా రాజశేఖరానికి కన్నులపండువగా కనిపించింది. అందరూ ఎవ్వరితోనూ మాట్లాడకుండా ఉత్సాహంగా తమతమపనులు చేసుకుంటున్నారు అవన్నీచూస్తూ దామోదరం అని ఉన్నబోర్డుగల గది దగ్గరకొచ్చి అమితోత్సాహముతో అగిది తలుపులుతెరిచి లోనికివెళ్ళబోయాడు. అంతే... అదేవేగంతో బయటకొచ్చి పడ్డాడు. తల దిమ్మెక్కింది. కాస్సేపటివరకు దిమ్మరపోయి తిరిగి తేరుకొని చూసేసరికి ఎదురుగా తెల్లని యూనీఫారముతో ఆఫీసుప్యూన్ భీమునిలా నిల్చొనియున్నాడు.

"పర్మిషన్ లేకుండా లోనికి పోవడమేనా?" అంటూ వెటకారంగా మాట్లాడాడు ప్యూన్.

రాజశేఖరం మెల్లగా లేచాడు. ప్యూన్ వద్దకొచ్చి "అయ్యా, నిన్నటి పబ్లిక్ మీటింగులో నేను దామోదరంగారిని కలుసుకున్నాను. వారు నా దీనస్థితికి ఎంతో జాలిపడ్డారు. ఉద్యోగంకొరకు తమ వద్దకు ఈ రోజు రమ్మన్నారు. అందుకే వచ్చాను" అన్నాడు వినయంగా.

"అలా పిలాపడకు ఆఫీసు విషయాలు కొత్తిగా తెలియని నువ్వు ఆఫీసులో ఏంపని చేస్తావయ్యా" అంటూ ప్యూన్ వెళ్ళి పోబోయాడు.

దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వడన్నట్లు ప్యూన్ వెళ్ళిపోతుంటే, చూస్తూ ఉండలేక

పోయాడు రాజశేఖరం. వాడు వెళ్ళిపోతే తను దామోదరం గదిలోనికి ప్రవేశించలేడు.

వెంటనే పరుగెత్తి ప్యూన్ కాళ్ళు రెండూ గట్టిగా దొరకపుచ్చుకొని 'బాబూ, నీకు పుణ్యముంటుంది. ఒక్కసారి దామోదరంగారిని చూడనివ్వు" అని బ్రతిమాలాడు రాజశేఖరం.

ప్యూన్ అతన్ని వింతగా చూచి "నా మామూలేది?" అని అడిగాడు చేతిని చాచి.

అతని మాటలు రాజశేఖరానికి బోధపడలేదు. ఆశ్చర్యంగా చూస్తూ "మామూలంటే" అని మాత్రం అనగలిగాడు.

"బాగుంది అదికూడా నేనే చెప్పాలా?"

"అయ్యా. మీరేమనుకోకండి. దయచేసి మామూలంటే మాత్రం ఏమిటో చెప్పండి" అన్నాడు.

ఆ గంతకుడు శాంతించి "లోపలికి పోవడానికి ముందు నాకు రెండురూపాయలివ్వవలసి యుంటుంది. తరువాత నేను మీకు దామోదరం గారి సెక్రేటరీని చూపే ఏర్పాటు చేయగలను. దాంతరువాత మీరు సెక్రేటరీకి గూడా పది రూపాయలు చెల్లించి దామోదరం గారిని కలుసుకోవాలి. ఇదీ అసలు సంగతి" అంటూ వివరించాడు.

రాజశేఖరం నిర్ఘాతం పోయాడు. "మరి ఈ విషయాలన్నీ దామోదరంగారు నాకు చెప్పలేదేం" అన్నాడు అనుమానంగా.

"అతడెలా చెబుతాడండీ. ఇది మేము సృష్టించుకున్నదే. ఎవ్వరైనా సరే డబ్బు చేతిలో పెట్టందే లోపలికి పోవడానికి వీలులేదు" అని జవాబిచ్చాడు ప్యూన్.

రాజశేఖరం బాధగా బెదిరింపు ధోరణిలో "అయితే నేను విషయాన్ని లోనికెళ్ళిన తరువాత దామోదరంగారికి చెబితే..." అన్నాడు.

ప్యూన్ కాస్సేపు క్రూరంగా రాజశేఖరాన్ని చూచి, తిరిగి వెంటనే మందహాసంతో "పిచ్చివాడా. నీవు కలియుగంలో పుట్టవలసిన వాడివి కాదు." అంటూ కాస్సేపాగి తిరిగి "సరే నీవు నాకేమీ యివ్వనక్కరలేదు. లోపలికెళ్ళి కలియుగమంటే ఏమిటో తెలుసుకో" అంటూ తలుపులు తెరిచాడు.

రాజశేఖరం ఉత్సాహంగా లోనికి అడుగు పెట్టాడు. ఎదురుగా దామోదరం ఈజీచైర్‌లో కూర్చొని తాపీగా సిగరెట్ పొగలు రింగులు రింగులుగా వదులుతున్నాడు. అతని చేతిలో న్యూస్‌పేపరు ఉంది.

చాలా సేపు నిరీక్షించాడు రాజశేఖరం. కాని దామోదరం చూపులు రాజశేఖరంపైన బడలేదు. విసిగిపోయి చివరకు పొడిదగ్గు దగ్గాడు రాజశేఖరం. దామోదరం పేపరులోనుండి తలను బైటికి పెట్టి రాజశేఖరాన్ని ఆశ్చర్యంగా చూచాడు.

"ఎవరండీ మీరు?" అన్నాడాశ్చర్యంగా దామోదరం.

"నన్ను గుర్తించలేదా సార్, నేనే రాజశేఖరాన్ని" అన్నాడు. కాని దామోదరం గుర్తించనట్లే "రాజశేఖర మనగానే సరిపోదు. మనమెక్కడ కలిశామోగూడా చెప్పాలి." అన్నాడు.

రాజశేఖరానికి ఉత్సాహం చచ్చిపోయింది. "నిన్న మీటింగులో మీరు నాకు కలిసి, ఈ రోజు రమ్మనమని చెప్పారు. అందుకే వచ్చాను" అన్నాడు అతి ప్రయాసగా.

దామోదరం పెదవి విరిచి "లాభం లేదబ్బాయి. నీ వెవరో నాకు తెలియదు. నిన్ను చూచినట్లు గూడా గుర్తులేదు. సరే అదంతా ఎందుకుగాని యిప్పుడు మీరు వచ్చిన పనేమిటో చెప్పండి. నాకు అవతల అర్జంటు పనులు బోలెడున్నాయి" అన్నాడు.

లోన యింత కపటాన్ని దాచుకొన్న మనుష్యులుగూడా ఈ లోకంలో ఉంటారని యిప్పుడు తెలుసుకున్నాడు రాజశేఖరం. అందుచేత రాజశేఖరం యింకేమీ మాట్లాడలేక "థ్యాంక్స్ వస్తా." అంటు గిర్రున తిరిగి బైటికి నడిచాడు.

ఇంటికి చేరుకున్న రాజశేఖరం ఘోరదుర్వార్త వినవలసి వచ్చింది. వైద్యసహాయంలేని తన తల్లి దుర్మరణం పాలయింది.

రాజశేఖరం దిమ్మెరపోయాడు. కన్నతల్లి... తన తల్లికొరకే తను బ్రతుకుతున్నాడు. ఆమెను సుఖపెట్టాలనే యింత వరకూ ఉద్యోగార్థం పలు చోట్లకు తిరిగాడు. పడరానిపాట్లు పడ్డాడు.

ఇక తను లోకంలో ఏకాకి. నా అన్న వారు తనకెవ్వరూ లేరు. స్వార్థంతో నిండిన ప్రపంచం తనకు తీరని అన్యాయం చేసింది.

తన జీవితంలో ఒక అధ్యాయం ముగిసి జీవితం కొత్త మలుపుకు తిరిగింది.

ఓ దిన పత్రికలో సబ్ ఎడిటర్ ఉద్యోగం ఖాళీగా ఉందని తెలిస్తే చూడడానికి వెళ్ళాడు రాజశేఖరం.

"నమస్కారమండీ" అన్నాడు ఎడిటర్. రాసుకుంటున్న వాడల్లా ఓ సారి తలెత్తి రాజశేఖరాన్ని ఆ పాదమస్తకం పరిశీలించాడు.

"ఇది ఇల్లు కాదోయ్ ఆఫీసు. ఇక్కడకూడా బిచ్చగాళ్ళు దాపురిస్తే ఎలా?" అన్నాడు విసుగ్గా ఎడిటర్.

రాజశేఖరం బిత్తరపోయాడు. "నేను బిచ్చగాణ్ణి కాదు సార్. మీ ఆఫీసులో ఉద్యోగం కొరకొచ్చాను." అన్నాడు.

ఎడిటర్ రాజశేఖరంవైపు వింతగా చూశాడు. తరువాత వెటకారంగా "నాకు కావలసింది సబ్-ఎడిటర్. అంతేగాని బంట్రోతు కాదు" అన్నాడు.

రాజశేఖరం వినయంగానే "అదే యిప్పించండి సార్. నమ్మకంగా చేస్తాను" అన్నాడు.

"మీరెంతవరకు చదివారు" అన్నాడు ఆశ్చర్యంగా ఎడిటర్.

"మీ నిబంధన ప్రకారం బియస్సీ సర్టిఫికేట్ సంపాదించాను సార్" అన్నాడు రాజశేఖరం బాధగా.

ఎడిటర్ కాస్త జాలిపడుతూ "చూడు మిష్టర్. ఇది సంఘపు అక్రమాలనూ, అమానుషాలనూ తీవ్రంగా విమర్శించే పత్రిక. నీకు విమర్శించే ధైర్యం ఉందా?" అన్నాడు సూటిగా.

రాజశేఖరం కళ్ళు ఆనందంతో మెరిశాయి. "నా ధ్యేయంకూడా అదే సార్. ఈ విషయంలో త్వరలోనే మీ మెప్పును సంపాదించగలను" అన్నాడు రాజశేఖరం.

అతనికి ఆ పత్రికాఫీసులో ఉద్యోగం దొరికింది. అక్రమాలు గురించి సమాచారాన్ని సేకరించడం, తీవ్రంగా విమర్శించడం అతని పని.

నిర్విరామంగా తన కర్తవ్య సాఫల్యతకు కృషి చేయసాగాడు రాజశేఖరం. తన అంతరంగంలో ప్రజ్వరిల్లే దావాగ్నిని పత్రికద్వారా బహిర్గతం చేయసాగాడు.


పత్రికలో ఓనాడు దామోదరం వంతు గూడా వచ్చింది. ఆ రోజు రాజశేఖరానికి సంపూర్ణ శాంతి లభించింది.

పత్రిక విడుదల అయిన మర్నాడే రాజశేఖరాన్ని రమ్మని, దామోదరం వద్దనుండి పిలుపొచ్చింది రాజశేఖరం నిస్సంకోచంగా దామోదరం వద్దకు బయలుదేరాడు

"రండి రండి" అంటూ సాదరంగా ఆహ్వానించాడు దామోదరం.

రాజశేఖరం తనలో తాను నవ్వుకున్నాడు

(మిగతా 54 వ పేజీలో)



# అపమర్థుడు

(16 వ పేజీ తరువాయి)

"నేను మీకు జ్ఞాపక మున్నానను కుంటాను" అన్నాడు వ్యంగ్యధోరణిలో.

"పిలిపించిన కారణం ?" సూటిగా అడిగాడు. దామోదరం ఎలా మొదలు పెట్టాలో తోచక తికమక పడ్డాడు.

"మీ పత్రికను చూశాను చాలా బ్రహ్మాండంగా రాస్తున్నారు. కాని రాసేముందు మమ్మల్ని సంప్రదించ నక్కరలేదా" అంటూ ఓ పొడిదగ్గు దగ్గి "అడిగితే మామూలు ముట్టజెప్పే వాణ్ణిగా" అన్నాడు వోరకంట చూస్తూ.

తారాజువ్వలా లేచాడు రాజశేఖరం. "క్షమించండి డబ్బు కక్కుర్తి మనిషినిగాను నేను. సంఘంలోని అక్రమాలను వాటిని సృష్టించే మానవులను పరిదిద్దాలని కంకణం కట్టుకున్నాను." అంటూ తన లక్ష్యాన్ని వివరించాడు.

దామోదరం మారు మాట్లాడకుండా డ్రాయరు తెరిచి రెండువేల రూపాయల నోట్లకట్టలు తీసి టేబిల్‌పైన పెట్టాడు. తరువాత రాజశేఖరాన్ని వోరకంట చూస్తూ "చూడండి. ఇది ప్రపంచం. డబ్బుతోగాని పనులు జరుగవు." అంటూ ఆగి "ఇవి రెండువేల రూపాయలు. మీరు వొకప్పుడు ఈ డబ్బుకోసమే నా వద్దకు ఉద్యోగార్థమై వచ్చారు." అంటూ తన అభిప్రాయాన్ని పరోక్షంగా తెలియజేశాడు. "క్షమించండి" అని నిరాకరించాడు రాజశేఖరం.

దామోదరం ఉగ్రుడయ్యాడు. "మిస్టర్, నేను తలుచుకుంటే ఏమైనా చేయగలను. నిన్ను బ్రతిమాల నవసరంలేదు. మర్యాదగా చెబుతున్నాను. ఈ డబ్బును తీసుకొని పేపర్లో నా గురించి రాసిన దంతా అబద్ధమని సవరణ వేయించండి" అన్నాడు.

"వీలుపడదు" అంటూ లేచాడు రాజశేఖరం, కోపంగా.

దామోదరం కూడా విసురుగా లేచాడు. "నీ నిర్ణయం అదేనా ? రేపు ఉదయం నీ పేపరు మూతపడుతుంది. నీవు మళ్ళీ నిరాశ్రయుడవౌతావు" అన్నాడు

రాజశేఖరం వెళ్లిపోతూ ఓ సారి దామోదరాన్ని ఏహ్యభావంతో చూచి "మిస్టర్ దామోదరం! నీకు డబ్బుంది. అందుచేత నీవు పేపరునే గాదు, వీలుంటే ప్రాణాలనుగూడా తీయగలగడంలో సమర్థుడవే కావినేను మాత్రం నా లక్ష్యాన్ని వదలను."

ఆ మర్నాడు, ఎడిటర్, రాజశేఖరం వద్దకు వచ్చాడు. "మిస్టర్ శేఖర్ ! న్యాయానికి స్థానం లేదు. పేపరు ఆఫీసుకు సీలు వేశారు" అన్నాడు.

రాజశేఖరం చిన్నగా నవ్వాడు తనకున్న ఒకే ఒక ఆస్థి చేతిసంచీ తీసుకొని తిరిగి బజార్లవెంట పడ్డాడు.

★

# ఇదిమాత్రం నిజం

(52 వ పేజీ తరువాయి)

చేతులతో కాగితం తీసింది. అస్తవ్యస్తంగా వున్న అక్షరాలు ఆమెకళ్ళముందు అలుక్కుపోతున్నాయి. అతి ప్రయత్నంమీద చదివింది...

అమ్మా నాన్నలకు,

నమస్కారాలు. మిమ్మల్నిలా బాధపెడుతున్నందుకు క్షమించమని అడుగుతున్నాను. మీరు పడినమనోవ్యధముందు యిదేమంత పెద్దదికాదనుకుంటాను. మీరంతా పైకి నన్నేమీ అనకపోయినా మనసులో ఎంతఅసహ్యించుకొంటున్నారో నిన్ననే అమ్మ ప్రవర్తన వల్ల తెలిసింది. కన్నవాళ్ళకు కూడాయింత బరువైపోయాక యింక బ్రతకటంతో అర్థం కన్పించటల్లేదు నాకు. అందుకే యీ సాహసం చేస్తున్నాను...

నా అడ్డు లేకపోతే సరళ పెళ్ళికి బాధపడ నక్కరలేదు మీరు. మంచి సంబంధం చూసి సరళ పెళ్ళి చేసేయండి...

అమ్మా నాన్నల ఆదరణకు కూడా నోచుకోని అభాగ్యురాలు.

— జానకి

'ఎంత తొందర పడ్డావ్ తల్లీ, ఎంత అపార్థం చేసుకున్నావమ్మా. ఛీఛీ. ఒక్కరోజు ఆలోచించ లేకపోయావా...' రంగనాథంగారి కంఠం గద్గదమైంది ......

'పాపిష్టిదాన్ని...నా మాటలకే తొందరపాటుకే బలయి పోయావు తల్లీ...నీ మనసెంత బాధపడితే యింతపని చేశావో...' కన్నతల్లి ఆవేదన ...

'నా పెళ్ళికి అడ్డుగా వున్నావని ఎప్పుడైనా అన్నానా అక్కా, అసలా భావనే నాకు రాలేదే..!' చేయని తప్పుకు పశ్చాత్తాప పడుతున్న సరళ...

ఒక్కరోజు తేడాలో విలువలన్నీ తారుమారయిన రామకృష్ణబాబు అతని నిర్ణయం లాగే ఎందుకూ కొరగాకుండా కాంతమ్మగారి చేతిలో నలిగిపోతూంది.

తుచ్ఛ విలువలకు ప్రాధాన్యత నిచ్చే సంకుచిత సమాజానికి, అర్థంలేని ఆవేశానికి బలై పోయింది జానకి జీవితం.

ఏమైనా ఒకటిమాత్రం నిజం...

భగవంతుడు జానకి హృదయంలోని సౌందర్యాన్ని రూపంలో వుంచి, ఆమె శరీరంలోని వైకల్యాన్ని మనసులో వుంచినా ఆమె యింత ఘోరశిక్ష విధించుకోవలసి వచ్చేదికాదు. దేవుడు వరంగా యిచ్చిన సున్నితహృదయమూ, సంస్కారమే ఆమె పాలిటి శాపాలుగా పరిణమించాయి.

★

# నీవు-నీచుట్టూ ప్రపంచం


(14 వ పేజీ తరువాయి)

తాము సమ్మెను యింక కొనసాగించలేమంటున్నారు. ముల్కీ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రారంభమైన పోరాటాన్ని, ప్రత్యేకాంధ్ర కొరకు నిరవధిక పోరాటంగా, రాజకీయ సమ్మెగా మార్చినందుకు నాయకులను ఖండించుతున్నారు. తమ పేరుతో నిధులు ప్రోగుచేస్తున్నప్పటికి తమకు సాయం అందడం లేదని గోలపెడుతున్నారు.

ఆంధ్రసేన తదితర సేనల ధోరణి పాత నాయకులకు, పార్టీలకు,అతీతంగా తయారయింది. రాబోయే రాష్ట్రంలో ప్రధానంగా అధికారం తమకే దత్తం కావాలంటున్నారు. ఇదంతా లక్ష్యశుద్ధి లేదనీ, వుద్యమాన్ని ఏకముఖంగా నడిపించగల నాయకత్వం లోపించిందనీ ద్యోతకం చేస్తున్నది.

ఐతే పార్లమెంటులో ప్రతీప శక్తులన్నీ కలిసి వేర్పాటు వుద్యమాన్ని బలపరచడంలో కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన భూసంస్కరణలు, పట్టణ ఆస్తుల పరిమితి వగైరా సామాజిక - ఆర్థిక మార్పులను వ్యతిరేకించడమే వారి లక్ష్యమని తేటతెల్లమవుతుంది. అందుచేత కార్మికులు, బీద రైతాంగం, వ్యవసాయకూలీలు వగైరా పీడిత ప్రజలంతా వేర్పాటువాదుల అరాచక చర్యలను అరికట్టేందుకు, కృషి చేయవలసి వుంది. ప్రగతిశీలురైన శ్రీమవాదులందరి తక్షణ కర్తవ్యం కూడా అదే!

★



Printed and Published on behalf of Naveenandhra Printing, Industrial and Agricultural Company (P) Ltd. by M. Nagabhushanam, at Swatantra Art Printers, Vijayawada-4. Editor - M. Chandhrasekhara Rao. Cover page printed at Jupiter Lithos, Vijayawada-7. Regd. No. H. 958.